అలనాడు.... అప్పుడెప్పుడో.... నా చిన్నప్పుడు.... నాటి సాయంత్రం.... వెలుగు నీడలు.... వయ్యారంగా సయ్యాటలాడుతున్నప్పుడు....

దేవుడి గుడిలో, గన్నేరు చెట్టు క్రింద ఎర్రని గులాబీ మీద రంగు రంగుల ఓ సీతాకోకచిలుక నిశ్శబ్దంగా వాలగా....

చటుక్కున దాన్ని గుప్పిట్లో పట్టేను. దాని వన్నె చిన్నెల రెక్కలు చూసి బాల్యంలోని చాపల్యంతో ముచ్చటపడ్డాను.

# ఆర్తనాదం



- రామవరపు వేణుగోపాలరావు

ఆ అందాన్ని నా అరచేతిలో ఒగించి నందుకు మురిసిపోయేను. అంతలో ఓ చిలిపి ఊహ నా బుర్రని పురుగులా దొలిచింది. సీతాకోక చిలుక రెక్కలు ఒక్కొక్కటీ ఊడలాగేను.

అప్పుడు....

నేను వినలేదు కాని....

అప్పుడది—' అయ్యో దేవుడా. ఎందుకు? ఎందుకిలా నన్ను శిక్షిస్తున్నావు?' అని కనిపించని దేవుడిని ఎలుగెత్తి అడిగే వుంటుంది. అప్పుడే....

ఆ రోజుల్లోనే....

ఏటి ఒడ్డున దొరికిన కప్ప కాలికి దారం కట్టివాన్ని బండ మీద బాదినప్పుడు అదీ అరిచే వుంటుంది....

'ఎందుకన్నా....ఎందుకిలా చేస్తున్నావు? నన్నెందుకిలా....?' అని గట్టిగా గుండె లవిసేలా ఆర్తనాదం చేసే వుంటుంది.

నా కయితే ఆ అరుపులు వినబడలేదు. మరి ఆ సర్వాంతర్యామికి ఏమయినా వినబడిందేమో!

ఏమో!!!

వినబడిన దాఖలాలు మాత్రం నాకేమీ కనిపించలేదు.

నేను పుట్టగానే నా కన్నతల్లిని నా నుంచి వేరు చేసినందుకు తెలీక అప్పుడు నేను అడగలేదు. కాని ఊహ తెలిసిన తర్వాత ఎన్నోసార్లు అడిగాను. మూగగా రోదించాను.

'ఎందుకు తండ్రీ? నా కన్నతల్లిని నా కంటి వెన్నెలని నా నుంచి ఎందుకుదూరం చేశావు?' అని ఆ దేవుడిని ఆ రాతి విగ్రహాన్ని రోజూ అడుగుతూనే వున్నాను.

గుడి పూజారిని. నిత్య నైవేద్యాలు పెడుతున్న వాడిని.

దూపదీపాలకు లోటు లేకుండా చేస్తున్న వాడిని. నా మాటకి బదులు లేదు. నాకే దిక్కు లేదు

సీతాకోక చిలుక మాటా, కప్ప మాటా దేవుడు వింటాడా?

* * *

పోనీ. ఎవరిమాటా వినవద్దు నామాటా కూడా వినవద్దు! కనీసం....

ఆ కిష్టిగాడి ఆర్తనాదం అయినా ఆ స్వామి చెవుల్లో పడితే చాలు అన్పిస్తోంది నా కిప్పుడు. దిక్కులు పిక్కటిల్లే వాడి కేకలు విన్నా చాలు....వాడిప్పుడున్న చెర ఏదోలా తప్పితే చాలు....

గర్భగుడిలో నూనె దీపాల వెలుగులో నిశ్చలంగా నిలబడివున్న స్వామిని చూశాను.

'ఎందుకు? ఎందుకయ్యా? ఎందుకిలా చేస్తున్నావు?' అనడిగాను. బదులు రాలేదు. రాదు రాదేమో....కాని అప్పుడే ఎక్కడో గుడ్లగూబ అరిచిన అరుపు మాత్రం కర్ణ కఠోరంగా వినిపించింది నాకు.

భూషయ్య గారి మండువా లోగిలి ముందున్న పశువుల పాకలో కిష్టిగాడు బాధగా 'అమ్మా' అన్న కేక కూడా అప్పుడే నా గుండెలు అవిసేలా వినవచ్చింది. నా ఒళ్ళు ఒక్కసారి జలదరించినట్టయింది.

సరిగ్గా గంట క్రితం నేనేం చూశానో తల్చుకుంటే-ఇప్పటికీ నా శరీరం వశం తప్పుతుంది. కాళ్ళ కింద చీకటి గుయ్యారాలు వికృతంగా నోళ్ళు తెరుచుకున్నట్టు అనిపిస్తుంది.

* * *

దీపాలు పెట్టే వేళ....

అప్పుడు....

స్వామి ప్రసాదం తీసుకొని భూషయ్య గారి లోగిలికి వెళ్ళాను. కాలేజీ చదువు వెలగబెడ్తున్న భూషయ్య కొడుకు అరుగు మీద కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్నట్టు నటిస్తున్నాడు. అల్లంత దూరాన పశువుల పాక ముందు కుర్చీలో వున్న భూషయ్య గారు తాపీగా చుట్ట కాలుస్తూ-అంత కన్నా తాపీగా-ఎదురుగా వున్న బక్కచిక్కిన జీవాన్ని పరీక్షగా చూస్తున్నారు. భూషయ్య గారి పెద్ద పాలేరు పలుపు తాడు చేత బట్టుకుని బక్కచిక్కిన ఆ బడుగు జీవిని చావబాదుతున్నారు. ఒక్కో దెబ్బ ఒంటి మీద పడుతున్నప్పుడల్లా ఆ జీవి "అమ్మో! నా యినా!" అంటున్నాడు. దెబ్బ వెయ్యనప్పుడల్లా "నన్నెందుకిలా కొడుతున్నావు దొరా?" అంటూ ఏడుస్తున్నాడు.

అంతలో-భూషయ్య గారు పెద్దపాలేరు వంక చూసి ఏదో సైగ చేశారు. చెయ్యడమే తడవు పాలేరు చేతిలోని పలుపుతాడు బక్కచిక్కిన బిక్కచచ్చిన పన్నెండేళ్ళ కిష్టిగాడి వీపు మీద యమపాశంలా పడింది.

'అమ్మో!!' అన్నాడు వాడు.

"ఎక్కడ్రా వాడు? చెప్పరా!" అని భూషయ్య హుంకరించారు.

"నాకు తెలీదు బాబో!" అన్నాడు వాడు.

రావలసినసమాధానం రాలేదు కాబోలు.

....పలుపుతాడు గాల్లోకి లేచింది మళ్ళీ.

మళ్ళీ "అమ్మో" అన్నాడు వాడు. గోచీ తప్ప వాడి ఒంటి మీద మరింకేం లేదు. వీపు మీద పడ్డ దెబ్బలు చారలు చారలుగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడా

### పురిటిబిడ్డ సైతం

పుట్టిన పురిటిబిడ్డ సైతం
కేర్ కేర్ మని
కేకలు వేస్తూ
రేపటి సమరం కోసం
వాళ్ళ 'వాడి'గా
పట్టు విడవడం లేదు.

—గిరి నాగభూషణం

## నిరీక్షణ

ఎన్నాళ్ళనుంచో
నీ రాకకై ఎదురుచూస్తూ
ఆనంద శిఖరాల్ని అధిరోహిస్తూ
ఊహల ఊయల్లో
ఊగుతున్నానో తెలుసా?
అంతలో
నీ వొచ్చావు, వెళ్ళావు?
ఇన్నాళ్ళూ నీ రాక కోసం
ఎదురు చూసింది ఇందుకా?
అందుకే నా హృదయం
రాయిగా మారి
నీ పై మమతనీ, నా ఆశల్ని
సమాధి చేసేసింది!
ఆపై నాలో ప్రేమజ్వాలగా రగిలి,
నా జీవితాన్నే గుగ్గిపాలు చేసింది!

—ప్రసాద్

రక్తం ఎర్రగా నల్లగా జిగురులా కనిపిస్తోంది.

నా చేతిలో ప్రసాదం పళ్ళెం....

గడపలో నేనున్నాను.

నా కళ్ళు భూషయ్య గారి కుమార్తె కోసం చూశాయి. ఆమె అలికిడి ఎక్కడా కనిపించలేదు. దూ ాన వున్న ఆమె గది వేపు చూశాను. కనీ కనిపించని దీపం వెలుగుల్లో ఆ గది తాళం తెల్లగా మెరుస్తూ కనిపించింది.

గదికి తాళం ఎందుకుంది?

కూతుర్ని గదిలో పెట్టి బయట తాళం ఎందుకు వేశాడు భూషయ్య?

రాటకి కట్టి, ఆ పన్నెండేళ్ళ కిష్టిగాడిని పశువుని బాదినట్టు ఎందుకలా చావ బాదుతున్నాడు?

మునసబు, కరణాలు ఎందుకలా చోద్యం చూసినట్టు చూస్తున్నారు? వాడినలా చావబాదుతూంటే ఒక్కరూ నోరు మెదపరేం? ఇదేమని అడగరేం?

"పంతులు గారూ, ఆ పళ్ళెం అలా గుమ్మంలో పెట్టి మీరు వెళ్ళండి." అన్నాడు పుస్తకం చదువుతున్నట్టు నటిస్తున్న భూషయ్య కొడుకు.

ఆ ప్రకారమే చేశాను.

చేసి వెనుదిరగబోతూ....దెబ్బల్తో వాతలు దేరిన కిష్టిగాడిని ఓసారి చూశాను.

"చెప్పరా, ఎవడ్రా వాడు? భూషయ్య కూతురి ఒంటి మీద చెయ్యి వెయ్య గలిగినంత మొనగాడెవడురా?" అని హుంకరిస్తున్నాడు భూషయ్య.

## రెండు 'జెన్' పద్యాలు

### I

ఎవరు నువ్వు?
అద్దంలో చూడక
అద్దా లబద్ధా లాడతై
అద్దాన్ని బద్దలకొట్టు
ఆ చట్రంలో కూచో
ఇప్పుడు తెలుసుకుంటావు.



### II

అంతా ఒక తెల్ల కాగితం

అందులో ఒక మూలగా
ఒక అడ్డుగీతా
ఒక నిలువు గీతా—
తెరచాప ఎత్తిన పడవ.

కిందిది నదీ
పైది ఆకాశమూ
కావొచ్చు.

—ఇస్మాయిల్

జీరవోయిన గొంతుతో ఏడవడం తప్ప మరొక జవాబు చెప్పలేక పోతున్నాడు కిష్టిగాడు. నాకేదో కొంచెం అర్థమయినట్టు అనిపించింది. అంతలోనే నా మెదడులో తళుక్కున ఏదో లీలగా మెరిసింది.

"ఒరేయ్! ఆఖరుసారి చెప్తున్నా విను. వాడెవరో, వాడి పేరేమిటో నీకు బాగా తెలుసు! నువ్వేకదురా మధ్యవర్తివి? మర్యాదగా వాడి పేరు చెప్పక పోయావో...." అని కాసేపు ఆగాడు.

"....లేదా—నీ మీద కిర యిలు పోసి తగలెట్టేస్తానా వెధవా?" అని పెద్ద పెట్టున గర్జించాడు భ

కాసేపు నిశ్శబ్దం.

"ఏదీ మునసబుగారూ, ఆ కిర్సనాయిలు డబ్బా ఇలా అందుకోండి" అన్నాడు మళ్ళీ.

"అయ్, అయ్" అన్నాడు మునసబు.

"పంతులుగారూ! మీరిక దయ చెయ్యండి" అన్నాడు భూషయ్య కొడుకు నా వేపే చూస్తూ.

ఉలిక్కిపడి, పరుగులాంటి నడకతో కోవెల దారి పట్టాను. అల్లంత దూరాన మసక వెన్నెల్లో ఓ మానవాకారం కనిపించింది అది మరెవరోగాదు. మునసబుగారి అబ్బాయి. అతని చేతిలో సూట్‌కేసుంది. పట్నం పోతున్నట్టున్నాడు. ఎలుగెత్తి అరిచాను. నా పిలుపు విని నడక మరింత జోరు చేశాడు. త్వరగా....త్వర త్వరగా అడుగులు వేసి....ఆ పల్లెటూరి తోటల మాటున అదృశ్యం అయ్యాడు.

గుడి మెట్లు ఎక్కి గన్నేరు చెట్టుకింద సిమెంటు చప్టామీద కూర్చున్నాను.

రెండు మూడు నెలల కిందటి సంగతి గుర్తుకొచ్చింది.


ఓ నాడు....

పూజా పుష్పాల కోసం మునసబు గారి తోటకి వెళ్ళాను. అక్కడ మకాంలో మునసబు గారి అబ్బాయి, భూషయ్య గారి కుమార్తె....

చూడకూడని దృశ్యమే చూశాను. ఒకరి ఒళ్లో ఒకరు

అప్పుడే నా మనసు ఏదో కీడు శంకించింది. కలవకూడని ధృవాలు ఇలా ఎందుకు చేరువ అయ్యాయో నాకు అర్థం కాలేదు. ఇద్దరూ పెద్ద చదువులు చదువుకున్న వాళ్ళే....కాని తల్లిదండ్రుల నరనరాల్లో నాటుకు పోయిన కులాభిమానం. అంతస్తుల అడ్డుగోడలు........వీళ్ళెలా





ఎవరో్కగలరా అనుకున్నాను. ఏమోలే.. ...నెగ్గుకు రాగలర్లే ... అన్న ధీమా నాలో ఎందుకో మరి ఏర్పడింది.

చూడకూడని ఆ దృశ్యం చూసీ చూడగానే-తప్పుకొని వెనుకడుగు వేశాను కాని ఇంత గ్రంధం జుగుతుందని ఊహించలేకపోయాను.

మునసబు గారబ్బాయినీ, కన్న కూతుర్ని-కొట్టలేక, తిట్టలేక-తన ఆగ్రహం అంతా ఆకిష్టిగాడి మీద చూపిస్తున్నాడు భూషయ్య.

దూరాన్నుంచి మళ్ళీ "అమ్మో— అమ్మో" అన్న గావుకేకలు వినిపించాయి. అవింకా నాకలా వినిపిస్తోనే విన్నాయి.

ఆ ఆర్తనాదాలు వినడం ఇష్టం లేక గుడిగంటలు మోగించాను. విరంతరాయంగా గణగణమంటూ గంటలు మోగుతున్నాయి. ఆ గణగణల్లో కిష్టిగాడి కేకలు లీనం అయిపోతున్నాయి.

'భూషయ్యా, వాడిని ఎందుకలా చావబాదుతున్నావ్? తప్పంతా నీ కూతురిది. అంతేకాదు. అదిగో అక్కడ నిల్చున్న ఆ మునసబుదీనూ....కావాలంటే వాళ్ళను చంపు....నరికి పోగులు పెట్టు! లేదా పెళ్ళి చేసి అక్షింతలు వెయ్యి. అంతేకాని ... పీకిని....ఈ కిష్టిగాడిని ఎందుకలా చంపుతావు?—'అని గట్టిగా అరవాలనిపించింది నాకు కాని ....అలా చెయ్యలేను. అది నా వల్ల కాదు. నాకు తెలుసా సంగతి.

అంతలో దూరంగా ఏదో భగ్గున మండినట్టయింది. గంటలు కొట్టడం అప్రయత్నంగా మానేశాను కిష్టిగాడి కేకలు మరి వినబడలేదు

ఆ రాత్రి ఎలా గడపగలిగానో నాకే తెలీదు. మరునాడు చీకట్నే స్నానాదికాల కోసం ఏటి గట్టుకి వెళ్ళాను. అక్కడ గట్టు వెంబడి వున్న పొదల మాటున చలనం లేని మానవాకారాన్ని--అంత చీకట్లోనూ చూశాను. నల్లగా, మసిబొగ్గులా వుంది ఆ ఆకారం. కళ్ళు మాత్రం తెల్లగా తెరుచుకుని వున్నాయి.

ఆ కళ్ళు....

అతి తెల్లగా వున్న దాంట్లోంచి ఎర్రనెర్రని మంటలు ఎగసి వస్తున్నట్టు తోచింది నాకు. ఆ మంటల నిండా ఎన్నెన్నో ప్రశ్నలు కనిపించాయి. మండుతూన్న ఆ ప్రశ్నలు నన్ను వదే వదే వెంటాడాయి. నా చెవుల్లో రొద చెయ్య సాగాయి.

ఎందుకు?

ఎందుకిలా ??

చివాలున వెనుదిరిగాను.

ఈ పాటికి మునసబు గారబ్బాయి పట్నంలో ఏ వెచ్చని దుప్పటికిందో చల్లగా నిద్రపోతూ వుండి వుంటాడు.

కిష్టగాడిని తండ్రి కొట్టిన ఒక్కొక్క దెబ్బా తన ఆత్మను శిదిలం చెయ్యగా— ఆ కన్న కూతురు ఈ పాటికి సగం చచ్చి వుంటుంది. సగం చచ్చిన ఆ తల్లి శరీరంలో ఇంకా ఆకారం ధరించని ఓ జీవి— క్షణక్షణం ఆయువు పోసుకుంటూ వుంది వుంటుంది.

సాటి మనిషిని చేతులారా చంపిన కిరాతకులు ఏదోలా న్యాయాన్ని కొనుక్కుంటారు.

అన్నీ తెలిసిన దేవుడూ, దేవుడి గుడిలోని పూజారి—రాతి బొమ్మల కన్నా అధ్వాన్నంగా గుండె రాయి చేసుకొని కూర్చున్నారు.

ఏమీ తెలియని ఒక అమాయక ప్రాణి ఆయువు మాత్రం పూర్తిగా తీరిపోయింది.

అలనాడు... అప్పుడు....నా చెవుల్లో ప్రతిధ్వనించిన కిష్టిగాడి ఆర్తనాదం— అప్పుడు, ఇప్పుడు, రేపు అనుక్షణం ప్రతిక్షణం—ఎన్ని సార్లని చెప్పను— అలా వినిపిస్తూనే వుంటుంది. నన్ను మండిస్తూనే వుంటుంది

